కథానిక

# సంస్కర్తలు

ఆర్. యం. చిదంబరం

యమున కాలేజీనుండి ఇంటి కాలస్యంగా వచ్చింది. కాలేజీలో "స్త్రీ స్వాతంత్ర్యం" మీద బ్రహ్మాండమైన చర్చ జరిగింది. ఉపన్యాసకులంతా యమున కళ్ళముందింకా ఉపన్యసిస్తూనే ఉన్నారు. యమున ఇంకా ఆ లోకంలో నేఉండి డ్రాయింగు రూములోవున్న కొత్త వారిని గుర్తించనే లేదు. "ఈమె నా డాటర్ యమున" అన్న తండ్రి కంఠ స్వరంవిని యమున ఈ లోకంలో పడింది. అతను "నమస్తే" అని చేతులు జోడించాడు. యమున కూడా చిరునవ్వుతో నమస్కరించింది. "నే నప్పుడప్పుడు చెబుతూండేవాడిని కదూ నా స్నేహితుడు సుబ్రహ్మణ్యం గురించి. ఇతనే." అని పరిచయం చేశారు ప్రొఫెసరు. కొత్త మగ వారిని చూడగానే తెరచాటుకు పోయే వనితలను మాత్రమే చూచిన సుబ్రహ్మణ్యం ఈ దృశ్యం చూచి ఆశ్చర్యపోయాడు. అతని కప్రయత్నంగా గడచిన కాలపు సంగతులు జ్ఞప్తికొచ్చాయి.

ఇద్దరూ కలిసి చదువుకునే కాలంలో ప్రొఫెసరు సంస్కరణంలో పడి చచ్చేవాడు. స్త్రీ స్వాతంత్ర్యం పట్ల విశేషాభిమానం కలిగుండేవాడు. కాని తనకు సాధ్యమైనంతవరకు ఆచరణలో పెడతాడని ఎవరూ విశ్వసించలేదు. "నీ చిన్ననాటి మాట ఆచరించి చూపావు సుమా."

స్నేహితుణ్ణి అభినందించాడు సుబ్రహ్మణ్యం.

సమాధానంగా ప్రొఫెసరు నవ్వి "ఏమిటో నువ్వలాగంటున్నావు కాని పలువురు పలు విధాల అనుకుంటున్నారు. మంచి పనికి విఘ్నాలు చాలా ఉంటాయి. రఘుని కావాలంటే ఇక్కడికి చదువుకోటానికి పంపు. మరేమీ ఫరవాలేదు. ఇద్దరూ కలిసి చదువుకుంటారు" అన్నారు. ఈ మాటకూడా సుబ్రహ్మణ్యాన్ని ఆశ్చర్యంలో ముంచి యెత్తింది.

"అలాగే" నని సమాధానం చెప్పి వెళ్ళిపోయాడు. రఘు సుబ్రహ్మణ్యం కొడుకు.

రఘు, యమునలు స్నేహితులయ్యారు. ఎన్నో విషయాలు చర్చించారు. కాని స్త్రీ స్వాతంత్ర్యం విషయం వచ్చేసరికి రఘు తప్పుకునేవాడు. యమున అతని భావాలు గ్రహింపలేక పోయింది. "మీకు స్త్రీలకు పురుషులతో సమానంగా హక్కులివ్వటం ఇష్టం లేదా?' ఆమె సూటిగా ప్రశ్నించింది.

"లేకేం. వుంది. కాని అది మన దేశంలో అమలు జరిగేదికాదు."

"దానికి యెవరు బాధ్యులు?"

దీనికి సమాధానం రఘుకి తోచలేదు. మౌనం వహించాడు.

"అసలు యెందుకు అమలు జరుగదు?"

ఆమె ముఖంలో గంభీరత తాండవించింది.

"స్త్రీలకు స్వాతంత్ర్యమిస్తే చెడిపోతారని అందరూ అనుకుంటున్నారు. అది నిజంగానే కనిపిస్తూంది."

"పురుషులు చెడిపోవటం లేదా?"

"అది వేరే సంగతి."

"అలాగంటే పనిచెయ్యదు. శాస్త్రాలు గ్రంథాలు మీరు రచించారు గనుక సరిపోయింది. మనుష్యుడు బొమ్మ వ్రాస్తే సింహాన్ని చంపుతున్నట్లుగా చిత్రిస్తాడు. సింహం వ్రాయగలిగితే మానవుడిని చంపుతున్నట్లుగా చిత్రిస్తుంది."

"ఈ చర్చవలన కలిగే ప్రయోజనమేమిటి?" విసుగ్గా ప్రశ్నించాడు రఘు.

"ఉంది. మీరు మీ భావిజీవితంలో మీ దగ్గరుండే స్త్రీలకు యెంత అవసరమో అంతే స్వతంత్రం యివ్వండి. సంస్కరణ కావాలని మొత్తుకున్నంత మాత్రాన ప్రయోజనం లేదు. ఇంట గెలిచి రచ్చ గెలవాలి."

"నాకు పనుంది. మళ్ళీ వస్తాను."

రఘు వెళ్ళిపోయాడు.

అతని గుర్చల హృదయాన్ని తలచుకునే సరికి యమునకు నవ్వు వచ్చింది. ఈ పరిచయం కలిగిన వెనుక అతనిలో కలుగుతూన్న మార్పును గుర్తిస్తూనే ఉంది. ఆమె అంటే రఘుకు తీరని అభిమానం. ఆమెను దినానికొకసారైనా కలుసుకోకుండా ఉండలేక పోతున్నాడు. అతని యెదలో ఏదో భావం మెదలుతూనే ఉంది. యమున అతన్ని సూక్ష్మంగా పరిశీలించింది. అతను చదువుకోటానికే తనింటికి రావటం లేదు. అతను తన్ను ప్రేమిస్తున్నాడు! యమున కూడా అతన్ని ఆదరించటం వలన ఆమె తనను ప్రేమిస్తున్నదని కూడా నమ్ముకున్నాడు.

* * *

సుబ్రహ్మణ్యం ప్రొఫెసరు ఇంటికి ఒక యువకుడిని వెంటబెట్టుకుని వచ్చాడు. "మన సుందరం లాగున్నాడే! నా ఊహ సరియేనా?" అనడిగారు ప్రొఫెసరు.

"అవును. మా బావ ఈ మధ్య వ్యాపారంలో చాలా పెద్దదెబ్బ తిన్నాడు. వ్యాపారంలో ఎప్పుడూ ఒకటే కదూ! అనిగేదొకటి. కలిగేదొకటి. సుందరం ఇంటరు మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. వాడిని చదివించమని దీనంగా ప్రార్థిస్తూ ఉత్తరం వ్రాసింది చెల్లెలు. ఒకరికొకరు ఆపదలలో సాయపడాలి కదా!" సుబ్రహ్మణ్యం విచారంతో అన్నాడు.

"దానికేమిటి! ఫరవాలేదు. రఘుతోపాటే అతనూ చదువుకుంటాడు. దీనికింత విచారమెందుకు?"

యమున సమయానికి కాలేజీనుండి వచ్చింది.

"ఇతను సుబ్రహ్మణ్యంగారి చెల్లెలు కొడుకు సుందరం. నీతోపాటే చదవటానికి వచ్చాడు. ఈమె నా డాటర్ యమున."

సుందరం రఘు యమున ఇంట్లో తరుచు ఉంటూంటారు. అనేకవిషయాలమీద చర్చలు జరుపుతారు. ఇద్దరూ కథకులు కూడా.

సుందరం వ్రాసిన ఆ కథను చూచిన తరువాత సుందరం మీద ఆదరణ ప్రేమ యమునకు రెట్టింపయాయి. సరిగా తన ఊహాల్నే చిత్రించాడు. అనేక విషయాల్లో ఆచరణ సాధ్యమైన మార్గాలు సూచించాడు. యమున ఆ కథ గురించే ఆలోచిస్తూనే ఉంది.

"ఏదో దీర్ఘంగా యోచిస్తున్నట్లున్నారే!"

సుందరం కంఠధ్వని విని యమున ఉలిక్కిపడింది.

"మీ కథకు నా కంగ్రాచ్యులేషన్స్. అత్యద్భుతంగా ఉంది."

"మీరుకాక నాకథను మెచ్చుకొనేదెవరు"

"అలాకాదు మీ అభిప్రాయాలు ఉత్తమంగా ఉన్నాయి"

"అంతే-ఏ సంస్కారం చేయాలన్నా అది హృదయ నిర్మలత్వంమీద ఆధారపడి ఉంటుంది. చెడునడత కలిగినవారికి స్వాతంత్ర్యం ఇస్తే ప్రయోజనమేముంది? కాని అదే సద్గుణాలున్న వారికిస్తే సద్వినియోగపడుతుంది. ఉత్త చెట్టుక్రింద కూర్చుని పాలు త్రాగినా కల్లు త్రాగామంటుంది లోకం." అతన్ని అమితంగా అభినందించింది యమున. అతను మరీ అసాధ్యమైన సంస్కారాలు పెట్టుకోలేదు. ఆచరణ సాధ్యమైనవే సూచించాడు.

యమునకు అతనంటే తీరని అభిమానం. అతనంటే ఆమెకు వెర్రి. సుందరం కూడా యమునంటే వెర్రిగా ఉంటాడు. అతనుకూడా యమునను ప్రేమిస్తున్నాడు!

"సుందరంకూడా ఇక్కడే వున్నాడేమిటి?" అంటూ రఘు వచ్చాడు.

యమునను చూడగానే అతని ముఖంలో యెంత అందం ప్రకాశించింది.

"మీరీ కథను చదివారా? సుందరంగారు రచించినదే. ఉత్తమంగా ఉంది. "గోపురాన్ని యెత్తిపెట్టండి-చూస్తాను" అనే రకపు సంస్కారి కాదు. మీరుకూడా ఏదో వ్రాసినట్టున్నారు. అది కూడా బాగానే ఉంది."

అతని ముఖంలో స్పష్టంగా విషణ్ణత కనిపించింది. అతని ఆశలు నిరాశలవుతున్నట్లు బాధపడ్డాడు. అతని వ్రాసిన వ్యాసాన్ని యమున పొగడలేదు. కాని సుందరం వ్రాసిన రచనను మెచ్చుకుంటోంది. దీని అంతరార్థం?

ప్రొఫెసరు షికారుకు బయలుదేరాడు. "నాన్నా! చూశావా! సుందరంగారు 'స్త్రీ స్వాతంత్ర్యం' మీద కథ వ్రాశారు."

"చదివానమ్మా! చాలా బాగుంది. ఆశయాలు చక్కగా ఉన్నాయ్. కాని ఆచరణలో పెట్టాలి. అక్కడే శ్రమంతా ఉంది. అక్కరకురాని ఆదర్శాలు పెట్టుకుని బల్లగుద్ది వాదిస్తే ప్రయోజనమేముంది? స్త్రీ యొక్క మనస్తత్వాన్ని గుర్తించి స్వతంత్రం యివ్వాలన్నాడు సుందరం. నిజం కూడా అంతే కాని చట్టాలు, శాసనాలు చేసి సంఘభావాలకు విరుద్ధంగా నడువనీయటం సమంజసం గాదు."

ప్రొఫెసరు ఉపన్యాసం మొదటిసారి విన్న సుందరం ఆయన హృదయాన్నర్థం చేసుకున్నాడు. ఆయన కుమార్తెకు ఎందుకు స్వేచ్ఛ యిచ్చాడో అర్థమయింది. కాని కాలేజీ అంతా కోడై కూస్తోంది. గోడలమీద పేర్లు తెగరాస్తోంది. ప్రొఫెసరు వెళ్ళిపోయాడు. ప్రొఫెసరు ఈ సంగతి తలచుకుని అప్పుడప్పుడు బాధపడేవారు. యమున వివాహం త్వరలో చేసేయాలని నిశ్చయించుకున్నారు. రఘు కూడా వెళ్ళిపోయాడు.

"కాలేజీలో మనను గురించి జరుగుతున్న ప్రచారం గుర్తించారా?" సుందరం ప్రశ్నించాడు.

"గుర్తించాను. లోకులు కాకులు."

యమున మార్పులేకుండా సమాధానమిచ్చింది.

"అవును. కాని అలాగని ఊరుకుంటే మన శ్రాంతి ఉండదు కదా" అన్నాడు.

అతనికేసిచూచి నవ్వింది యమున. ఆ నవ్వే అతనికి సమాధానం. అదే అతని జీవితానికి జ్యోతి. యమున తన ప్రేమ సంగీకరించింది. తనవంటి ఆశయాలను సాధించే వ్యక్తిని కాకపోతే మరెవరిని కట్టుకుంటుంది. అతనిముఖంలో గర్వరేఖ పొడచూపింది.

సుందరం యమునవద్ద సెలవు తీసుకొని ఇంటిముఖం పట్టాడు.

"అమ్మాయికి ఈ మార్చిలో పెళ్ళి చేసెయ్యాలి. చాలా గొడవగా ఉంది."

"అవును. మీరన్నట్లుగా మంచి పనికి విఘ్నాలు చాలా."

సుందరం ప్రొఫెసరు సుబ్రహ్మణ్యాల సంభాషణ విన్నాడు. అయితే మార్చిలో తనకీ యమునకూ వివాహమవుతుందన్న మాట. ఎంత ధన్యమైనది తన జీవితం. అతనానందం పట్టలేక పోయాడు. ఆనందబాష్పాలతని చెంపల మీదనుండి జారాయి.

* * *

సుందరం పదిరోజులు టూరు వెళ్ళి తిరిగి వచ్చాడు. అనంత సాగరంలో డోలలూగించే కమ్మటి ప్రకృతి దృశ్యాలు దర్శించి ఉప్పొంగిపోయాడు. అతని హృదయమంతా ఆనంద క్షీరంతో నిండియుంది. ఈ నెలలోనే యమున పెళ్ళి.

"ఒరే సుందరం! ఇదిగోరా శుభలేఖ."

సుబ్రహ్మణ్యం శుభలేఖ దానితోపాటు మరొక ఉత్తరం అందించాడు

"ఈ ఉత్తరం యమున నీకిమ్మని ఇచ్చింది."

ఆత్రంగా శుభలేఖ చూచాడు.

రఘునాథరావుకు యమునకు పెళ్ళి. అతని హృదయంమీద వజ్రఘాతం తగిలినట్లయింది. నిలువునా కూలిపోయాడు. "వంచకీ" అన్నాడు యమునను. యమునతో సరదాగా గడిపిన దృశ్యాలు జ్ఞప్తికి వచ్చి తీరని దుఃఖాన్ని కలిగించాయి. ఆ ఉత్తరం చదివాడు.

"సుందరం గారూ!

మీరు ఆశాభంగం పొంది ఉంటారు. ఈ లోకంలో ప్రతి వ్యక్తికి కర్తవ్యం ఒకటుంది. కలం పట్టగలిగినవాడు వ్రాస్తాడు. గుండె బలం కలవాడు ఆచరిస్తాడు. ఏమీ చేయలేనివాడు గాలి మేడలు కడుతూ తృప్తి పొందుతాడు.

మీరు ఆశయ స్రష్ట. మీ ఆశయాలను ఆచరించగలిగిన సామర్థ్యం ఉంది కాని రఘునాథరావు గారికి గుండె బలం [illegible]. ఆయనకు ఆశయాలు బోధించి కర్తవ్యానికి త్రిప్పాలని సంకల్పించుకొన్నాను. అందుకే ఆయనతో భాగస్వామి కాదలిచాను. అప్పుడే నా కోరిక ఈడేరుతుంది. ఇది నా కర్తవ్యమని విశ్వసిస్తున్నాను. ఆయన నిజమైన సంస్కర్తగా మారాలనేది నా కోరిక. దీనివలన మీకు బాధ కలిగితే క్షమించాలి.

యమున."

అతను ఉత్తరం ముడుచుకుని వెర్రిగా ఇంటి కప్పువైపు చూచాడు.